క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 11వ వార్డులో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కౌన్సిలర్ నీలావతి తెలిపారు. అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొనాలని కోరారు.

గార్లదిన్నె: కల్లూరులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

'మాది రైతు సంక్షేమ ప్రభుత్వం'



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి, జోజోడే కుమార్

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, పట్టణ, రూరల్ అధ్యక్షులు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. కరువుకోరల్లో చిక్కుకున్న పామిడి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించడం ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఆర్‌బీకే, వైఎస్సార్ పొలంబడి, రైతుభరోసా, వడ్డీలేని రుణాలు వంటి లాంటి పథకాలతో రైతులకు పెద్దపీట వేసిన ఘనత సీఎం జగన్‌ది అన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



దాత తండ్రి లింగమయ్యను సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

గుంతకల్లు రూరల్: మండలంలోని తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రఘురామ్ రూ. 44 వేలు విలువగల కంప్యూటర్‌ను బహూకరించారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన డాక్టర్ రఘురామ్ నెల్లూరులో స్థిరపడ్డారు. ఈక్రమంలో ఆయన తన తండ్రి లింగమయ్య ద్వారా గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డికి డెస్క్‌టాప్ కంప్యూటర్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు లింగమయ్యను సత్కరించారు.

రాజ్యాంగంపై అవగాహన కల్పించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: భారత రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని భారత రాజ్యాంగ అవగాహన వేదిక మహిళా విభాగం అధ్యక్షురాలు జె.సరస్వతి తెలిపారు. గురువారం సాయినగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో భారత రాజ్యాంగ పీఠిక పఠన కార్యక్రమం జరిగింది. ప్రభుత్వం, పౌరులు, వారి హక్కులు, బాధ్యతలు తదితర వాటి గురించి వివరించారు. హెచ్ఎం మహమ్మద్‌రఫీ, వేదిక కోకన్వీనర్లు బాలరాజు, రామాంజినేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో నీటివసతి ఏర్పాటు



బోరుబావిలోంచి వస్తున్న నీరు

పెద్దపప్పూరు: మండల కేంద్రం నుంచి ధర్మాపురం వెళ్లే రోడ్డుమార్గంలో నూతనంగా నిర్మించనున్న జగనన్న కాలనీలో గురువారం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక నాయకులు బోరు వేయించి నీటి వసతి ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన దాదాపు 150 మందికి ప్రభుత్వం ఇంటి పట్టాలను మంజూరు చేసింది. వాటిలో కొందరు పునాదులు పూర్తి చేయగా మరికొందరు ప్రారంభించారు. నీటి ఇబ్బందులు ఉన్నాయని ఇటీవల లబ్ధిదారులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి తేవడంతో తక్షణమే అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈనేపథ్యంలో కోఆప్షన్ సభ్యుడు హాజీవలి బోరు వేయించి నీటి వసతి ఏర్పాటు చేశారు. నీటి సమస్య తప్పిందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

పేదరిక నిర్మూలనే జగనన్న ధ్యేయం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



నార్పలలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

నార్పల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పని చేస్తున్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని సచివాలయం-1 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆమెతో పాటు ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరుకాగా డప్పు వాయిద్యాలతో బాణసంచా కాలుస్తూ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించారు. స్థానికులతో సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్రం బాగుంటుందన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు ఉంటాయన్నారు. ప్రతి పక్షాలు చేసే తప్పుడు ప్రచారాన్ని పట్టించుకోకుండా జగనన్నను మరోసారి గెలిపించుకుందామన్నారు. ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు హైకోర్టు మధ్యంతర బెయిల్ మాత్రమే ఇచ్చిందన్నారు. నాలుగు వారాల తర్వాత మళ్లీ జైలుకు వెళ్లక తప్పదన్నారు. కానీ పచ్చపార్టీ నాయకులు మాత్రం నిజం గెలిచింది అంటూ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశంలో ఏ ఖైదీకైన అనారోగ్య కారణాలు ఉంటే న్యాయస్థానాలు బెయిల్ ఇస్తాయన్నారు. అలాగే చంద్రబాబు విషయంలో కూడా అదే జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ నాగేశ్వరావు, సర్పంచు మన్నీల సుప్రియ, సొసైటీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎంపీటీసీలు నారాయణమ్మ, వెంకట నారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారి ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, కో ఆప్షన్ షాబీరా, మాజీ సర్పంచు ఖాదర్‌వలిఖాన్, ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు, నాయకులు గుత్తి గోపాల్‌రెడ్డి, ఎల్లప్ప, గోపాల్, సునిల్, రాము, శివ, ప్రసాద్, రవీంద్ర గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విమర్శలకు తావివ్వకండి

- గుంతకల్లు ఆర్డీఓకి కలెక్టర్ గౌతమి సూచన



కలెక్టర్ గౌతమికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి

అనంతపురం అర్బన్: విధి నిర్వహణలో ఏదశలోనూ విమర్శలకు తావివ్వకూడదని కలెక్టర్ గౌతమి గుంతకల్లు ఆర్డీఓ వి.శ్రీనివాసులురెడ్డికి సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు సంబంధించి లక్ష్యాల పూర్తిపై దృష్టిసారించాలని చెప్పారు. కలెక్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో ఆర్డీఓగా నియమితులైన శ్రీనివాసులు రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలు నాణ్యతగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. గుంతకల్లు ప్రత్యేక అధికారిగా ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం, రీ సర్వే, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

గుంతకల్లు రూరల్: గుంతకల్లు ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులురెడ్డి గురువారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



దంచర్లలో మిర్చి రైతులకు సలహాలిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మిర్చి పంట సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏపీఎంఐపీ ఏపీడీ ఫజలున్నీసా బేగం రైతులకు సూచించారు. మండల వ్యాప్తంగా ఈ ఏడాది 5 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఈ క్రాప్ బుకింగ్ ద్వారా విషయాన్ని తెలుసుకున్న గుంటూరు కమిషనరేట్ అధికారులు మిర్చి పంట పరిశీలనకు ఆదేశించారు. దీంతో గురువారం ఏపీడీ హార్టికల్చర్ ఆఫీసర్ మిత్రవింద మాధవితో కలిసి దంచర్ల, జీ.కొట్టాల, నెలగొండలో పంటను పరిశీలించారు. ఈసందర్భంగా ఏపీడీ రైతులకు మిర్చి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దంచర్లలో సాగుచేసిన మిర్చి పంటకు ఎండు తెగులు సోకిన నేపథ్యంలో నివారణ చర్యలను తెలియజేశారు. ప్రకృతి పద్ధతిలో మిర్చి సాగుపై రైతులు దృష్టి సారించాలని, తద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించవచ్చని పేర్కొన్నారు.

నేడు ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

బుక్కరాయసముద్రం: పి.కొత్తపల్లిలోని జగనన్న లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలకు శుక్రవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ భాస్కర్ తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతున్నారన్నారు.

'అవ్వా పింఛన్ అందిందా'



వృద్ధురాలితో మాట్లాడుతున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: ఏం అవ్వా..పింఛన్ అందిందా, నెలనెలా సక్రమంగా పింఛన్ సొమ్ము ఇంటి వద్దే ఇస్తున్నారా అంటూ ఎమ్మెల్యే తనయుడు యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. గన్నెవారిపల్లి, జంబులదిన్నె, చల్లవారిపల్లిలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో ఫించన్ తీసుకోవడానికి పడరాని పాట్లు పడేవారమని ఇప్పుడు ఏ ఇబ్బంది లేకుండా తెల్లవారుజామునే ఫించన్ అందుతోందని అవ్వా తాతలు సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ రవికుమర్, నాయకులు ప్రదీప్‌రెడ్డి, బాబా పక్రుద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రాజారెడ్డి, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు పరిరక్షణ సంఘం కమిటీ ఎన్నిక

గుంతకల్లు: సమాచార హక్కు పరిరక్షణ సంఘం గుంతకల్లు నియోజవర్గ కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హోన్నూరప్ప, డాక్టర్ హరిప్రసాద్‌యాదవ్ గురువారం తెలిపారు. నియోజకవర్గ అధ్యక్షురాలిగా శివప్రియ ఫౌండేషన్ అధ్యక్షురాలు మనోప్రియా, ప్రధాన కార్యదర్శిగా జింకల వేణుగోపాల్, కోశాధికారిగా తలారి ఆనందరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాండురంగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ఆధిపత్యం వద్దు.. అభివృద్ధే ముద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ శరత్‌చంద్ర

పెద్దపప్పూరు: ఆధిపత్యం కోసం పోటీపడితే జీవితాలు దెబ్బతింటాయని, అందరూ కలిసికట్టుగా ఉంటే గ్రామం అభివృద్ధి చెందుతుందని ఎస్ఐ శరత్‌చంద్ర అన్నారు. గురువారం రాత్రి నామనాంకపల్లి, చిక్కేపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన గ్రామస్తులకు మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తు బాగుపడాలంటే ఆధిపత్యం జోలికి వెళ్లకూడదన్నారు. తమ పిల్లలు విద్యావంతులుగా ఎదిగి ఉద్యోగ అవకాశాలు వచ్చినపుడు కుటుంబ నేపథ్యాన్ని ఆరా తీస్తారన్నారు. మీ గ్రామాల్లో ఎలాంటి చిన్నపాటి సమస్య వచ్చినా పోలీసుల దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరిస్తామని గ్రామస్తులకు వివరించారు.

ఆముదం సాగు లాభదాయకం



ఆముదం పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం: ఆముదం పంట ఎంతో లాభదాయకంగా ఉంటుందని భారతీయ నూనె గింజల పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శాంతలక్ష్మి, రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ సహదేవరెడ్డి పేర్కొన్నారు. గురువారం రేకులకుంటలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఆముదం పంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంత లక్ష్మి మాట్లాడుతూ ఆముదం పంటకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఐసీహెచ్-05 రకం సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ పవన్‌కుమార్ రెడ్డి, డాక్టర్ దుర్గాప్రసాద్, లక్ష్మణ్, జయచంద్రనాయక్, తదితరులు పాల్గొన్నారు.

5న గుండె వైద్య శిబిరం

గుంతకల్లు: ఈ నెల 5న పట్టణంలోని చైతన్య థియేటర్ సమీపంలోని సరోజని నాయుడు మున్సిపల్ హైస్కూల్‌లో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ధర్మవరం ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌పీవీ రమణయ్య గురువారం తెలిపారు. అనంతపురం మార్క్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు 2డీ ఎకో, ఈసీజీ, బ్లడ్ షుగర్, బీపీ తదితర పరీక్షలు నిర్వహిస్తారన్నారు. యూటీఎఫ్ నాయకులు రాఘవేంద్ర, రాజ్‌కుమార్, శంకరయ్య, రామకృష్ణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ అధికారులు



హుస్సేన్ బీకి నగదు, సెల్‌ఫోన్ అందిస్తున్న అధికారులు

గుత్తి: ఓ ప్రయాణికురాలు బస్సులో మరిచిపోయిన నగదు, సెల్‌ఫోన్‌ను ఆర్టీసీ అధికారులు బాధితురాలికి అందజేసి నిజాయితీ చాటుకున్నారు. వివరాలు..కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన హుస్సేన్‌బీ గురువారం బెంగళూరు నుంచి ఆర్టీసీ బస్సులో పత్తికొండకు బయలుదేరింది. అయితే బస్సు అనంతపురం బస్టాండ్‌లో ఆగిన సమయంలో తన బ్యాగ్‌ను బస్సులో పెట్టి బాత్ రూం వెళ్లింది. ఆ సమయంలో బస్సు వెళ్లిపోయింది. హుస్సేన్‌బీ విషయాన్ని అక్కడ ఆర్టీసీ అధికారులకు తెలియజేసింది. వెంటనే వారు గుత్తి ఆర్టీసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. గుత్తి ఆర్టీసీ అధికారులు బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని అందులో ఉన్న రూ.12,710 నగదుతో పాటు సుమారు రూ.7 వేల విలువైన సెల్‌ఫోన్‌ను బాధితురాలికి అందజేశారు. హుస్సేన్ బీ ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసింది.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి అర్బన్: మండలంలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం సెబ్ అధికారులు సీజ్ చేశారు. ఆలూరు వద్ద డ్రైవర్ కుళ్లాయప్ప, పట్టణంలోని యల్లనూరు రోడ్డులో డ్రైవర్ రంగయ్యను అరెస్ట్ చేసి ట్రాక్టర్లను ఆయా పోలీస్‌స్టేషన్లకు అప్పగించినట్లు సెబ్ సీఐ విజయ్ కుమార్ తెలిపారు.

నేడు మండల మీట్

పామిడి: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల మీట్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ గురువారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక పాల్గొనాలని కోరారు.

వార్డుల్లో పర్యటించిన కమిషనర్

గుత్తి: పట్టణంలోని 21, 22, 23వ వార్డుల్లో గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వార్డుల్లోని డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. తాగునీరు, సీసీరోడ్లు, వీధి దీపాలపై ఆరా తీశారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని వెంటనే దగ్గరుండి పారిశుద్ధ్య కార్మికుల చేత శుభ్రం చేయించారు. డీఈ రఘు, ఏఈ సాయి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నెలలు తక్కువ శిశువుకు అరుదైన వైద్యం



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్, బిడ్డ తల్లి శ్రీదేవి

గుంతకల్లు: ఏడు నెలలకే జన్మించిన ఓ శిశువును దాదాపు 66 రోజులుపాటు చికిత్స అందించి బిడ్డకు ఆయువు పోసిన ఘటన పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. దోసలుడికి గ్రామానికి చెందిన శ్రీదేవి, రమేష్ దంపతులకు ఇద్దరు సంతానం. అయితే మూడో కాన్పు శ్రీదేవికి డిసెంబర్ 2న అవుతుందని వైద్యులు చెప్పారు. అయితే గడిచిన ఆగస్టు 25న శ్రీదేవికి తీవ్రమైన రక్తస్రావం కావడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పతిలో అడ్మిట్ చేశారు. ఈ క్రమంలో వైద్యులు అత్యవసరంగా సాధారణ కాన్పు చేశారు. శిశువు ఏడు నెలలకే జన్మించడంతో 700 గ్రాముల బరువు మాత్రమే ఉంది. వైద్యులు పట్టణంలోని సాయికృష్ణ నర్సింగ్ హోంకు తరలించి చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ పవన్‌కుమార్‌కు శిశువు ఆరోగ్య పరిస్థితిని వివరించారు. దీంతో వైద్యులు పవన్‌కుమార్ ముందుగా కృతిమ శ్వాస అందించి ప్రాణాపాయ స్థితి నుంచి బయటకు తీసుకువచ్చారు. అనంతరం శిశువుకు మూడు వారాల పాటు ఎన్ఐసీయూలో శ్వాస సహాయ పరికరాలపై ఉంచి చిక్సిత అందిస్తూ పిండిపదార్థాలు, మాంసకృత్తులను సెలైన్ ద్వారా ఇచ్చారు. శిశువుకు రక్తంలో తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ సోకగా యాంటీ బయాటిక్స్ సెలైన్‌లను ఎక్కిస్తూ నయం చేశారు. దాదాపు 65 రోజుల చికిత్స తర్వాత శిశువు 1.5 కేజీ బరువు పెరగడంతోపాటు ఆరోగ్యవంతంగా ఉండడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

గుంతకల్లు రూరల్: కసాపురం సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద ముళ్ల పొదల్లో గురువారం ఉదయం కుళ్లిన వ్యక్తి మృతదేహం లభ్యం అయింది. ఎస్ఐ గోపాలుడు తెలిపిన వివరాలు..గురువారం ఉదయం పొలం పనులకు వెళ్లిన రైతులు కుళ్లిన మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో వ్యక్తి మృతి చెంది 15 నుంచి 20 రోజులు అయి ఉండవచ్చని, వయసు 40 నుంచి 45 లోపు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం పక్కనే పురుగుల మందు, మద్యం సీసా ఉండటంతో అతడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. తెల్ల షర్ట్, తెల్ల పంచ ధరించి ఉన్నాడు. మృతి చెందిన వ్యక్తి షర్ట్‌పై వీఎస్ టైలర్స్, మహీంద్రా స్ట్రీట్ అనే లేబుల్ ఉంది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పురపాలకా.. రాజకీయం చాలిక!



తాడిపత్రి ప్రధాన కూడలిలో మురుగునీరు పారుతున్న దృశ్యం

- తాడిపత్రిలో తీవ్రమైన డ్రైనేజీ సమస్య
- పట్టించుకోని పాలకవర్గం
- ఆందోళనలతో పబ్బం గడుపుకుంటున్న వైనం

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణం మురుగుకంపు కొడుతోంది. పలు కాలనీల్లో డ్రైనేజీ సమస్యలు పెరిగిపోవడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. కనీసం ఇళ్లల్లో ఉండలేక పోతున్నారు. సమస్యలు పరిష్కరించాల్సిన పాలకవర్గం చేతలు మాని అధికారపార్టీపై నిందలు వేస్తూ ఆందోళనలతో పబ్బం గడుపుకుంటుండంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల సైతం మురుగునీరు పారుతోంది. కనీసం నడవడానికి కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కారణంగా దోమలబెడద ఓ వైపు.. తాగునీటి కలుషితం మరో వైపు పట్టణ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

జేసీ మాటలు.. వట్టివేనా!

పట్టణంతో డ్రైనేజీ సమస్య తీవ్రమైన మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఏమీ పట్టనట్లు వ్యవహరించడం ఆందోళనకే ప్రాధాన్యం ఇవ్వడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నిక అయిన సందర్భంగా జేసీ ప్రభాకర్‌రెడ్డి మీడియా సాక్షిగా మాట్లాడుతూ తాడిపత్రి పట్టణాభివృద్ధికి అవసరం అయితే కమిషనర్‌ను కలుపుకొని ఎమ్మెల్యే దగ్గరకు అయినా వెళ్తా అని ప్రకటించారు. అయితే తీరా ఆచరణలోకి వచ్చే సరికి ఆయన వట్టివిగానే మిగిలిపోయాయని, తనను నమ్మిన పుర ప్రజల శ్రేయస్సును గాలికి వదిలేశారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పట్టణంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి పూనుకున్నా జేసీ ప్రభాకర్‌రెడ్డి అడుగడుగునా అడ్డుపడుతున్నారు. తాను పరిష్కరించాల్సిన డ్రైనేజీ సమస్యను అధికార పార్టీపైకి నెట్టడం తగదని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. రాజకీయాలు ఎన్నికలప్పుడు మాత్రమే చేయాలని ఇలా ప్రజలకు సంబంధించిన విషయంలో చేయడం సరికాదని చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకవర్గం డ్రైనేజీ సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఫుట్‌బాల్ విజేతలకు అభినందన



ఫుట్‌బాల్ విజేతలను అభినందిస్తున్న దృశ్యం

గుత్తి: ఇటీవల అనంతపురంలో జరిగిన ఎస్కేయూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల ఇంటర్ జోన్ ఫుట్‌బాల్ పోటీల్లో గుత్తి ఎంఎస్ డిగ్రీ కాలేజీ విజేతగా నిలిచింది. గురువారం గుత్తి ఎంఎస్ డిగ్రీ కాలేజీలో ఫుట్‌బాల్ క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీలిమా, పీడీ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా క్రైస్తవుల సమాధుల పండుగ



క్రైస్తవ సమాధుల్లో పండుగ నిర్వహిస్తున్న దశ్యం

పామిడి: స్థానిక కొత్తబస్టాండ్ వద్దనున్న క్రైస్తవ శ్మశాన వాటికలో గురువారం సమాధుల పండుగను ఘనంగా నిర్వహించారు. సమాధులపై పూలు చల్లి కొవ్వొత్తులు వెలిగించారు. ఈసందర్భంగా సీఎస్ఐ చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యేసు మతి పొంది తిరిగి లేచెనని, మనం నమ్మితే, అదే ప్రకారము యేసునందు నిద్రించిన వారిని దేవుడాయనతో వెంట బెట్టుకొస్తారన్నారు. సీఎస్ఐ చర్చి సభ్యులు వీరయ్య, పీసీ రత్నరాజు. పీ అనిల్‌కుమార్ రాజా, అబ్రహాం, ప్రకాష్, సురేష్, ప్రసాద్, అల్లీపీరా, బాలకుమార్, రమణ, స్టానీ, స్వప్నిల్, ప్రిస్కిల్లా, వాత్సల్య తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ ఎస్ఐగా రామకృష్ణ

తాడిపత్రి అర్బన్: స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా ముత్యాల రామకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. యల్లనూరు ఎస్ఐగా ఉన్న ఎం.రామకృష్ణను ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ డీఎస్పీ గంగయ్య, సీఐ హమీద్‌ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మట్కాబీటర్ల అరెస్ట్

యల్లనూరు: యల్లనూరు, తాడిపత్రి, ఎస్‌కేకాల్వ, పాలూరుకు చెందిన నలుగురు మట్కా బీటర్లను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.1,4500 నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ



పామిడి పోలీస్‌స్టేషన్‌ను చుట్టిముట్టిన దృశ్యం

పామిడి: స్థానిక సంతమార్కెట్‌వీధి (నారాయణస్వామి వీధి)లో గురువారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇందులో ఇద్దరు గాయాలపాలయ్యారు. పోలీసుల వివరాల మేరకు..సంతమార్కెట్‌వీధికి చెందిన ఓ యువతి వివాహం సందర్భంగా ఊరేగింపు జరిగింది. ఇందులో పాల్గొన్న యువకులు మూత్ర విసర్జన కోసం మరో ప్రాంతానికి వెళ్లగా అక్కడున్న ఓ వర్గం వారు ఘర్షణకు దిగి దాడి చేశారు. దీంతో సమాచారం అందుకున్న పెళ్లి ఊరేగింపు వర్గం వారు వెళ్లగా వారిపై రాళ్లు, కత్తులతో దాడి చేశారు. దాడిలో సుంకన్న, మీనాక్షి గాయపడ్డారు. వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సుంకన్నను అనంతపురం తీసుకెళ్లారు. సంతమార్కెట్‌వీధి వాసులు పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.